www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 19 డిసెంబర్ 2025
5
అన్నమయ్య





అమరావతిలో రెండవ రోజు జరిగిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్ కుమార్

బిల్లును ఉపసంహరించుకోవాలి

- వ్య.కా.స రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు
- విబి-జి ఆర్ఎమ్ జి బిల్లు ప్రతులు దహనం



బిల్లు ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వానికి కీలక మద్దతుగా ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేటట్లు కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలకు నిరసనగా విబి-జిఆర్ఎమ్ జి బిల్లు ప్రతులను వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో దహనం చేశారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి ఆర్ఎమ్ జి) పేరుతో ఉపాధి హామీ చట్టానికి రాం..రాం పలకనున్నారని పేర్కొన్నారు. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారని తెలిపారు. ఇప్పటి వరకు వ్యవసాయ కార్మికులకు డిమాండ్‌ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చివేసి అవసరాన్ని (సప్లైని) బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. గ్రామీణ కూలీలకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని పక్కదారి పట్టించేందుకు ఈ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించారని పేర్కొన్నారు. పనిదినాలు 100 నుండి 125 రోజులకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకేనని, ఉపాధి హామీ చట్టం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుందని పేర్కొన్నారు. మరోవైపు 10 నుండి 40 శాతానికి రాష్ట్రాలపై భారం పెంచారని, ఇప్పటికే యంత్రాలు కేటాయించి కూలీల డిమాండ్ తగ్గించారని విమర్శించారు. వ్యవసాయ పనుల పేరుతో 60 రోజుల ఉపాధిని సస్పెండ్ చేసి ఈ పథకాన్ని రైతులకు పోటీగా మారుస్తోందని పేర్కొన్నారు. ఈ పథకం అమలుకు ఇప్పటి వరకు కేంద్రం ఇస్తున్న 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై రూ.వేల కోట్ల అదనపు భారం వేస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంపై ఏటా సుమారు రూ.4 వేల కోట్లు అదనపు భారం పడనుందని, ఇప్పటికే రూ.లక్షల కోట్లు అప్పుల్లో వున్న రాష్ట్రం ఈ అదనపు భారాన్ని ఎలా భరించగలదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరిశర్మ, నారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బి.రమేష్ బాబు, మంజునాథ, రమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు 5జి మొబైల్ ఫోన్లు అందజేత



వాల్మీకిపురం : అంగన్వాడీలకు ఫోన్లు అందజేస్తున్న డైరెక్టర్ అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అందించిన 5జి ఫోన్‌లను అందించినట్లు స్థానిక సిడిపిఒ భారతి తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో వాల్మీకిపురం, గుర్రంకొండ, కలికిరి మండలాల్లోని 340 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కంభం దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి చేతుల మీదుగా ఫోన్‌లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పిల్లలు, గర్భవతులు, బాలింతలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం 5జి ఫోన్‌లను అందించిందన్నారు. లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారికి సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మనోహర రాజు, డిప్యూటీ ఎంపిడిఒ సుధాకర్ రెడ్డి, టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు గుర్రం మల్లికార్జున రెడ్డి, నాయకులు సయ్యద్‌బాష, నారాయణ రెడ్డి, కోసూరి రమేష్, షబ్బీర్ పాల్గొన్నారు. **పీలేరు:** పీలేరులో అంగన్వాడీ కార్యకర్తలకు 5జి స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసినట్లు ప్రాజెక్ట్ అధికారి రాజమ్మ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి చేతుల మీదుగా వాటిని అందజేశారు. కార్యక్రమంలో పీలేరు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి, టిడిపి ప్రముఖ నేత పోలిశెట్టి సురేంద్ర, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోళ్ళ కిషోర్ నాయుడు, జనసేన మండల అధ్యక్షులు మోహన్ కృష్ణ, రెడ్డి ముని, రాజేష్, ధనశేఖర, సురేష్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ఐసిడిఎస్ ప్రాజెక్ట్ బి.కొత్తకోట పరిధిలో ఉన్న 221మంది అంగన్వాడీ కార్యకర్తలకు 5జి మొబైల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిడిపిఒ భాగ్యమ్మ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మొబైల్ ఫోన్లతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న అంగన్వాడీల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పెద్దతిప్పసముద్రం మండలంలోని 74 మంది అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్స్ అందించారని తెలిపారు. మండలంలోని 13 మంది మినీ కార్యకర్తలను ప్రధాన కార్యకర్తలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



విజ్ఞాన ప్రదర్శనను వీక్షిస్తున్న ఎంఇఒ, అధ్యాపకులు

విద్యార్థుల మేధాశక్తికి వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-పీలేరు

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని ఎంఇఒ-2 పద్మావతి తెలిపారు. గురువారం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో మండల స్థాయి వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనలను పీలేరు బాలికల జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంలో విద్యార్థులు ప్రతిభ కనబరచడానికి వీలుగా విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. మండల పరిధిలోని 15 ఉన్నత పాఠశాలలు, 4 గురుకుల పాఠశాలల విద్యార్థులు సృజనాత్మకతతో విజ్ఞాన శాస్త్ర నమూనాలను ప్రదర్శించారు. పాఠశాలల వారిగా విద్యార్థులు చేసిన ఈ వస్తు ప్రదర్శనల ఎన్నిక చేయడం కోసం న్యాయ నిర్ణయాలగా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల అధ్యాపకులు పి.భాస్కర్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు దివ్యశ్రీ వ్యవహరించారు. మండలంలో 19 పాఠశాలలకు గాను 85 నమూనాలను ప్రదర్శించారు. ప్రదర్శనలో పీలేరు బాలికోన్నత పాఠశాల విద్యార్థిని భవిత, జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థిని షఫాఅల్మా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ముజామిల్లా, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని టిఆర్ హేమశ్రీ, మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థిని ప్రసన్న, కోటపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.సిరి, స్థానిక ప్రధాన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్ ఫరీన్ ఏడు విభాగాల్లో ఒక్కొక్కరు చొప్పున జిల్లా స్థాయికి ఎన్నిక కాబడ్డారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు, సిఆర్పిలు జలకనూరి మురళీధర్ రాజు, నాగరాజ, మాధవి, శ్వేత, భవితా ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీ పేరు తొలగించడం అన్యాయం : వైసిపి

ప్రజాశక్తి రాయచోటి అర్బన్

గ్రామీణ భారతదేశ అభివృద్ధికి మూలస్తంభంగా నిలిచిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్ఆర్ఇజిఎస్) నిర్వీర్యం చేయడం అన్యాయమని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకానికి ఉన్న మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా బిజెపి ప్రభుత్వం తన అసలు స్వరూపాన్ని బయట పెట్టిందంటూ మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటనను విడుదల చేశారు. 2006లో అప్పటి సిఎం రాజశేఖర్ రెడ్డి, కమ్యూనిస్టుల సహకారంతో పార్లమెంటులో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ సహకారంతో పార్లమెంటులో చట్టాన్ని తీసుకురావడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. 90 శాతం కేంద్ర ప్రభుత్వం 10 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అమలైన ఎన్ఆర్ఇజిస్ పథకం గ్రామాల్లో అభివృద్ధి పరంగా నడిపించిందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించడమే కాకుండా రాష్ట్ర వాటాగా ఉన్న 10 శాతంను 40 శాతానికి పెంచడం దారుణమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వంపై 40 శాతం భారం పెంపు ఫలితం రాష్ట్రంలో కోటి మంది కూలీల జీవితంపై ప్రభావం చూపుతుందన్నారు. గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏర్పాటుచేసిన స్వచ్ఛమైన సచివాలయ వ్యవస్థను కూడా కూటమి ప్రభుత్వం స్వర్ణ గ్రామంగా పేరు మార్చి నిర్వీర్యం చేసేందుకు శత విధాల ప్రయత్నం చేస్తుందన్నారు. సచివాలయం వ్యవస్థ అమలు జగన్‌కు మంచి పేరు తీసుకొస్తుందని భయంతోనే టిడిపి నేతలు సక్రమంగా పనిచేయనివ్వడం లేదంటూ ఆరోపించారు.

కార్పొరేట్ల కోసమే పిపిపి విధానం : కాంగ్రెస్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టాడానికే మెడికల్ కాలేజీలు సిఎం చంద్రబాబునాయుడు ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ విమర్శలు గుప్పించారు. మదనపల్లె మెడికల్ కాలేజీ వద్ద కాంగ్రెస్, సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు మెడికల్ కాలేజీలపై వైసిపి ప్రభుత్వ తీరుపై విమర్శలు చేసి ఇప్పుడు అదే విధానం అమలు చేయడం సంమజసమా, అప్పుడు తప్పు అయ్యింది, ఇప్పుడు ఒప్పయిందా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో ప్రయివేటు విధానం ఉండదని పలుమార్లు చెప్పి ఇప్పుడు పిపిపి విధానాన్ని అమలు చేయడానికి ఎలా ముందుకు వస్తారన్నారు. బిజెపి మోచేతి నీళ్ల తాగుతూ వారు చెప్పినట్లు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. ఆదాని రాష్ట్రానికి వస్తే ప్రజాపాలన గాలికి వదిలేసి గెస్ట్ హౌసులలో పెట్టి ఏది అప్పగించాలో చర్చల్లో మునిగిపోయారని విమర్శలు గుప్పించారు. వైద్య కళాశాలలను పిపిపి విధానంలో అమలు చేస్తే కార్పొరేట్ శక్తులకు లాభం చేకూరుతుందే తప్ప, పేదలకు ఒరిగేదేమి లేదన్నారు. వెంటనే పిపిపి విధానం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలో కొనసాగితేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. పేదల ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అలా కాకుండా పిపిపి విధానం అమలు చేస్తే పేద వైద్య విద్యార్థులకు, రోగులకు ఎలాంటి మేలు జరగదని వివరించారు. పిపిపి విధానంపై తెచ్చిన జిఒ నెం.590 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.కె.బాషా, మైనారిటీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ మహబూబ్ పీర్, శరత్ కుమార్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

'నిండు జీవితానికి రెండు చుక్కలు'



వాల్మీకిపురం : చింతపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ సాయిశ్రీ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని మండలంలోని నగరిమడుగు పిహెచ్‌సి వైద్యులు చౌదరి నయీమ్, రిచార్డ్ స్టీఫెన్ అన్నారు. గురువారం మండలంలోని నగరిమడుగు పిహెచ్‌సిలో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21వ తేది ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మండలంలోని 23 కేంద్రాల్లో టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు తప్పనిసరిగా వారి పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేయించాలన్నారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు వేయించే టీకాలతో సంబంధం లేకుండా పల్స్‌పోలియో చుక్కలు వేయించడం తప్పనిసరి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, పిహెచ్‌సిలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఎంపిపి పాఠశాలల్లో టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలకు టీకాలు వేయించాలని సూచించారు. ఆదివారం వేయించుకోని పిల్లలకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికి వెళ్లి చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని చింతపర్తిలో డాక్టర్ సాయిశ్రీ ఆధ్వర్యంలో పల్స్‌పోలియో చుక్కలపై ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ రామాంజులు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, ఎంఎల్‌హెచ్‌పిలు, సిబ్బంది పాల్గొన్నారు. **పీలేరు:** పిల్లల నాడీ వ్యవస్థ దెబ్బతిని అంగవైకల్యానికి దారి తీసే పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రజలందరి సహకారం అవసరమని ఎంపిడిఒ శివశంకర్ డాక్టర్ శ్రీగిరీష, డాక్టర్ రాధామాధవి తెలిపారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో పోలియో నిర్వహణ టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21న ఆదివారం జరిగే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమిష్టిగా విజయవంతం చేద్దామని అన్నారు. మండల పరిధిలోని 0-5 సంవత్సరాల పిల్లలు 7,896 మంది పిల్లలను లబ్ధిదారులుగా గుర్తించామని పేర్కొన్నారు. వీరి కోసం 44 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిలో సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. సమావేశములో పాల్గొన్న వ్యాక్సినేటర్స్‌కి పిల్లలకు వ్యాక్సినేషన్ చేయు సమయంలో తీసుకోవలసిన మెలకువలు గురించి డాక్టర్లు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి పోలియో చుక్కల కార్యక్రమ జయప్రదం చేయడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఐసిడిఎస్, సిడిపిఓ రాజమ్మ వ్యాక్సినేషన్ పల్స్ పోలియో జయప్రదానికి అందరూ కలిసికట్టుగా బాధ్యత వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు, అంగన్వాడి కార్యకర్తలు, ఎఎన్ఎంలు, సిహెచ్ఒలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి : జెసి



వికలాంగుడికి ఉపకరాలు అందజేస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి- రాయచోటి

సామాన్య జనంలో విభిన్న ప్రతిభావంతులు కూడా ఒక భాగమే అని గుర్తించిన ప్రభుత్వం వారి సాధికారత కోసం పాటుపడుతోందని జెసి ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. సామాజిక అధికారిత శివిర్ కార్యక్రమంలో భాగంగా గురువారం రాయచోటి కలెక్టర్ కార్యాలయపు ఆవరణంలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సంస్థ, జిల్లా పరిపాలన, సంయుక్తంగా ఈ సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాయి. జెసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అవయవ లోపాలున్న వికలాంగులకు కృత్రిమ అవయవ పరికరాలు, సహాయక ఉపకరణాలను అందించే బృహత్తర కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టిందన్నారు. ఒక మంచి ఆలోచనకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కార్యరూపమే ఆలింకో సంస్థ అన్నారు. సామాజిక సాధికారిత శివిర్‌కి విచ్చేసిన అందరితో మాట్లాడడం చాలా ఆనందంగా ఉందన్నారు. సమాజంలో వికలాంగులు కూడా ఒకరుగా ఉండాలన్న సదుద్దేశంతో కార్యక్రమాన్ని దేశ ప్రధాని నరేంద్రమోడీ దేశ వ్యాప్తంగా తీసుకురావడం గర్వించదగ్గ విషయం అన్నారు. పేదలు, రైతులు, మహిళల సాధికారితతో పాటు వికలాంగుల సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలలో 2025 ఆగస్టు 6 నుండి 8 వరకు ఎడిఐపి, అర్‌వి వై పథకాల కింద అంచనా శిబిరాలు నిర్వహించామని చెప్పారు. శిబిరాల ద్వారా మొత్తం 832 మంది లబ్ధిదారులను గుర్తించి, రూ.1,21,05,454 విలువైన 2,292 సహాయక పరికరాలను మంజూరు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల చైర్మన్ గడుపూడి నారాయణస్వామి, సంక్షేమ అనుబంధ శాఖల అధికారులు, బ్యాంకింగ్ తదితర అనుబంధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా మనమిత్ర సేవలు : ఎస్‌పి



మాట్లాడుతున్న ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేస్తూ పారదర్శకమైన పాలన అందించే దిశగా జిల్లా పోలీసు యంత్రాంగం మరో ముందడుగు వేసిందని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి అన్నారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రవేశపెట్టిన 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇకపై ఫిర్యాదుదారులు తమ ప్రథమ సమాచార నివేదిక ప్రతిని నేరుగా తమ మొబైల్ ఫోన్లలోనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. సాధారణంగా ఎఫ్ఐఆర్ కాపీ కోసం బాధితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, సాంకేతికతను ఉపయోగించుకుని ఈ వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ప్రజల సమయాన్ని ఆదా చేయడం, పోలీసు సేవల్లో జవాబుదారీతనం పెంచడమే ముఖ్య లక్ష్యమన్నారు. మన మిత్ర ద్వారా ఫిర్యాదుదారులు ఎక్కడున్నా తమ ఎఫ్ఐఆర్ ప్రతిని పొందే అవకాశం ఉందన్నారు. ప్రజలు చాలా సులభంగా మొబైల్‌లో 9552300009 నంబర్‌ను సేవ్ చేసుకోని వాట్సాప్ ద్వారా సదరు నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేయాలని, మెనూలో కనిపించే పోలీస్ సర్వీస్ పైన క్లిక్ చేసి, ఆపై డౌన్లోడ్ ఎఫ్ఐఆర్ ఆప్షన్‌ను ఎంచుకోవాలని చెపాపరు. ప్రాథమిక వివరాలను నమోదు చేసిన వెంటనే ఎఫ్ఐఆర్ ప్రతి డౌన్‌లోడ్ అవుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది ఈ సేవపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఫిర్యాదు అందిన వెంటనే బాధితులకు 'మన మిత్ర' సేవల గురించి వివరించాలని సూచించారు. జిల్లా ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని డైట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించనున్న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం ప్రధానోపాధ్యాయులకు సూచించారు. గురువారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 'వికసిత్, ఆత్మ నిర్భర్ భారత్ కోసం స్టెమ్' అనే ప్రధాన ఇతివృత్తం ఆధారంగా పాఠశాల స్థాయి నుండి జాతీయస్థాయి వరకు విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు ఈనెల 16న పాఠశాల స్థాయిలోనూ, 18న మండల స్థాయిలోనూ విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ నిర్వహించామన్నారు. ఈ నెల 20వ తేదీన రాయచోటిలోని డైట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో నిర్వహించనున్న జిల్లాస్థాయి సైన్స్ ఫైర్‌లో మండల స్థాయి విజేతలంతా పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమం విజయవంతం అయ్యేటట్లు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నుంచి 11 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజాసంక్షేమాన్ని, సమస్యలను గాలికి వదిలేసిన సిఎం చంద్రబాబునాయుడు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ అన్నారు. గురువారం తాడేపల్లిలో జగన్మోహన్‌రెడ్డి కోటి సంతకాల సమావేశంలో పాల్గొన్న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి పాలనలో భూ కబ్జాలు, మట్టిమాఫియా, మద్యం మాఫియా నడుస్తోందని ఆరోపించారు. ప్రజా పాలన గాలికొదిలేసి కేవలం దోపిడీ పాలన చేస్తూ నాలుగేళ్ల కాలం గడిపి మరో ఏడాది ఎన్నికలు ఉన్నప్పుడు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి రావడానికి ప్రయత్నం చేస్తాడన్నారు. ఇక ప్రజలు వారి మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి, గతంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన పథకాలు, సంక్షేమం తెలియజేశారని తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ ద్వారా కార్పొరేట్ విధానంలో భారీగా నగదు చేతులు మారి క్విడ్ కో ప్రోగా మారిందని ఆరోపణలు చేశారు. పిపిపి విధానంపై పలు అనుమానాలు ఉన్నట్లు ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. జగన్ పేదలకు వైద్యం, పేద విద్యార్థులకు వైద్య విద్య అందించాలని తెచ్చిన మెడికల్ కాలేజీలతో పేరు వస్తుందని, జగన్‌పైన కోపంతో ప్రయివే టీకరణ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు గ్రహించి మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను అడ్డుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న తొగటవీర క్షత్రియ సంఘం సభ్యులు

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లె జిల్లా ఏర్పాటులో ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాత్ర కీలకమని తొగటవీర క్షత్రియ సంఘం సభ్యులు కొనియాడారు. గురువారం స్థానిక చౌడేశ్వరి దేవి ఆలయంలో శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ, తొగటవీర క్షత్రియ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నీరుగుట్టువారిపల్లిలో చేనేత రంగాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న తొగటవీర క్షత్రియులకు వృద్ధాప్యంలో ఆశ్రయం అవసరం చాలా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కావున శ్రీచౌడేశ్వరి దేవి వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసుకోవడానికి మూడు ఎకరాలు స్థలాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా స్థానిక కదిరి రోడ్డు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అమ్మచె రువుమిట్ట వరకు నీరుగుట్టువారిపల్లితో కలిపి సుమారు లక్ష జనాభా ఉన్నారని, అందులో మరణించిన వారి అంత్యక్రియలకుగాను స్మశాన వాటికను ఏర్పాటు చేస్తూ స్థలం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని మదనపల్లెను జిల్లాగా ప్రకటించటం, మదనపల్లి జిల్లాను సాధించటంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చూపిన చొరవను ప్రసంసించారు. పట్టణం విస్తరిస్తున్న నేపథ్యం, జిల్లా కేంద్రం కావడంతో వృద్ధాశ్రమానికి, శ్మశాన వాటికకు సహృదయంతో స్థలాలను కేటాయించాలని కోరారు. మదనపల్లి పట్టణా భివృద్ధికి శ్రీ తొగటవీర క్షత్రియ సంఘం తమ పూర్తి సహకారమిస్తుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తొగటవీర క్షత్రియ సంఘం విజ్ఞప్తి మేరకు వృద్ధాశ్రమం, శ్మశాన వాటిక ఏర్పాటు కు స్థలాలను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ కమిటీ అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామిశెట్టి ఆంజనేయులు,తొగటవీర క్షత్రియ సంఘం గౌరవాధ్యక్షులు మోడెం వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బండి పవన్ కుమార్, కోశాధికారి రామిశెట్టి రత్నమయ్య, ఉప్పు రామచంద్ర, మోడెం సిద్ధప్ప, రామిశెట్టి నీలకంత, బండి నాగరాజ పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి : విద్యార్థి దశ నుంచి దృఢమైన కెరీర్ పునాదులు వేయడం ఎంతో ముఖ్యమని న్యూఢిల్లీకి చెందిన ఎసిపి కె.అచిత్ నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగపు ఆధ్వర్యంలో గురువారం ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం సివిల్ సర్వీసెస్, ప్రభుత్వ ఉద్యోగాలపై కెరీర్ గైడెన్స్ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దృఢమైన కెరీర్ పునాదులు వేయడం ఎంత ముఖ్యమో వివరించారు. కాలం, శక్తి విలువలను గుర్తించి, అనవసరమైన వినోదాలు, ప్రతికూల ఆలోచనల వైపు దారి మళ్లకుండా లక్ష్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులు పాజిటివ్ దృక్పథం, క్రమశిక్షణ, ఏకాగ్రతతో పాటు దృఢ సంకల్పం, ఆత్మ విశ్వాసంతో నిరంతరంగా శ్రమిస్తే విజయం తప్పక సాధ్యమవుతుందని ప్రోత్సహించారు. సివిల్ సర్వీసెస్‌తో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను కూడా మంచి కెరీర్ అవకాశాలుగా పరిశీలించాలని, సాఫ్ట్‌వేర్ రంగానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ బహుళ కెరీర్ అవకాశాలను తెరిచి ఉంచుకోవాలని సూచించారు. సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు మోటివేషన్, కమ్యూనికేషన్ స్కిల్, అర్థమెటిక్, రీజనీరంగ్ అంశాలపై అందిస్తున్న ప్రత్యేక శిక్షణను కళాశాలలోని డిజిటల్ లైబ్రరీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను మెరుగు పరుచుకుని ఉన్నత స్థానాలు అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం రిసోర్స్ పర్సన్‌ని సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.వెంకటరమణ, వివిధ విభాగాల డీన్‌లు పాల్గొన్నారు.



అచిత్ నాయుడును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ఇన్‌ఛార్జి ఎంపిపిగా రాధ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల ఎంపిపిగా ఉన్న లక్ష్మీనరసమ్మపైన నవంబర్ 14న మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి సమక్షంలో 11 మంది ఎంపిటిసిలలో 10 మంది అవిశ్వాసం ప్రకటించగా దానికి సబ్ కలెక్టర్ ఆమోదం తెలిపారు. మండలంలోని పది మంది ఎంపిటిసిలలో ఒకరైన బడికాయలపల్లి ఎంపిటిసి ఎన్.రాధ ప్రదీప్ రెడ్డిని ఇన్‌ఛార్జి ఎంపిపిగా గురువారం ఎంపిడిఒ అబ్దుల్ షుకూర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి, వైసిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఖలీల్ అహ్మద్, కార్యకర్తలతో ఎంపిడిఒ కార్యాలయం వద్ద హాజరై రాధకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపిటిసిలలో ఎవరు కూడా తెలుగుదేశం పార్టీ వారు లేనందువల్ల కేవలం వైసిపి సభ్యులు మాత్రమే ఉండడంతో ఇన్‌ఛార్జి ఎంపిపిగా ఎం.రాధ ఎన్నిక లాంఛనమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి సహకారంతో మండలాన్ని అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పెండింగులో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. తనను ఇన్‌ఛార్జి ఎంపిపిగా ఎన్నుకున్న ఎంపిటిసిలకు, సహకరించిన ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి, మాజీ ఎంపిపి ఖలీల్ అహ్మద్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఖాదరవల్లి, నాసర్, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు రూ.8.25 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని అంగనవాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.8.25 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మిథున్ చక్రవర్తి తెలిపారు. ఎంపికైన అంగన్వాడీ కేంద్రాలను గురువారం వారు క్షేత్రస్థాయిలో సందర్శించి పనులు చేపట్టడానికి పరిశీలించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండ లంలోని 13 అంగన్వాడీ కేంద్రాలలో రూ.4.68 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణాలను, 21 కేంద్రాలలో రూ.3.57 లక్షలతో తాగునీటి సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. దేవళం కురవపల్లె, ముష్టూరు, బండ్లపై, ఎర్రాతి వారిపల్లి, రాచవేటివారిపల్లి, బురుజు హరిజనవాడ, పిట్టావాండ్లపల్లి, వెంగం వారిపల్లి, వి.గొల్లపల్లి, సైదాపేట-1, చౌకిల్లవారిపల్లె, తరిగొండవారిపల్లి, చిన్నల్లవారిపల్లె కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. తాగు నీటి సౌకర్యం ఏర్పాటు కొరకు ఎంపిక చేసిన అంగనవాడి కేంద్రాలలోనూ త్వర లోనే పనులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనితో అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులకు, గర్భిణులు, బాలింతలకు మరింత మెరుగైన వసతులు అందు బాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.శ్రీవాణి నవీన్ పాల్గొన్నారు.

భవిత కేంద్రం చిన్నారులకు భోజన వసతి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పికెఎం-ఉడా సెక్రటరీ పి.ఆర్.మనోహర్ తండ్రి పి.వి కృష్ణమూర్తి సందర్భంగా బి.కొత్తకోట పట్టణం స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగ పిల్లలకు పట్టణంలోని యువకులు కంచి కళ్యాణ్ కుమార్ రెడ్డి,టి.జనార్దన్,కే.వేణుగోపాల్‌లు భోజనాలు ఏర్పాటు చేశారు.ఇందులో భాగంగా భవిత కేంద్రంలో చిన్నారులకు భోజనం వసతి ఏర్పాటు చేసి,వారితో గడపడం ఆనందంగా ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతుల పట్ల వివక్ష చూపకుండా ప్రేమతో ఆదరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

సచివాలయాల్లో డిప్యూటీ ఎంపిడిఒ తనిఖీ

ప్రజాశక్తి-కలకడ : మండలంలోని పలు సచివాలయాలను మండల డిప్యూటీ ఎంపిడిఒ చక్రపాణి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.మండలంలోని బాలయ్యగారిపల్లి, ఏనుగుంటపాలెం పంచాయతీల్లోని సచివాలయాలను తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. సచివాలయాలలో సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సచివాలయాలకు సమయానికి వచ్చి విధినిర్వహణలో విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో సానుకూలంగా స్పందించి వారి పనులను సకాలంలో పూర్తి చేసి పంపాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న గృహ సర్వేలు, ఇతర సర్వేలను సకాలంలో పూర్తిచేసే టార్గెట్ ను పూర్తి చేయాలని సూచించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దేవేంద్ర, వేణు, జయచంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి-నందలూరు

మండల పరిధిలోని నల్లతిమ్మాయపల్లి జడ్‌పి హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు పశుసంవర్ధక శాఖ సూపరింటెండెంట్ పాపయ్య విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఇష్టంతో కష్టపడి చదివి మంచి ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. పట్టుదల, ఏకాగ్రతతో చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు,పాఠశాలకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, యం.చంద్రశేఖర్, శిలువతుల్లా, నిత్యపూజయ్య, ఆయేషాపర్వీన్, సాబ్‌జాన్, తేజ విద్యార్థులు పాల్గొన్నారు.



మెటీరియల్ చూపుతున్న విద్యార్థులు

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-వీరబల్లి

మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ గౌస్‌బాషా, డిప్యూటీ ఎంపిడిఒ జ్యోతీశ్వరరాజు మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి మండల ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు. అధికారులు తమ తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు.ప్రజా ప్రతినిధులు పంచాయతీలలో సమస్యలను లేవనెత్తి అధికారులను నిలదీశారు. మట్లి సర్పంచ్ నాగార్జునచారి మాట్లాడుతూ మట్లి ఎల్లంపల్లి నుంచి తొగటపల్లి వరకు వర్షం పడినప్పుడు రోడ్డుపైన నీరు నిలిచి ప్రజలు, విద్యార్థులు, ఇబ్బందులు పడుతున్నారని సైడ్ కాలువ తీయాలని కోరారు. వీరబల్లి బస్టాండ్ దగ్గర పోలీసుస్టేషన్ కు పోయే రోడ్డు మురికి నీటితో నిండిపోయిందన్నారు. పరిష్కార మార్గాలు లేవా అని నిలదీశారు. ఎంపిడిఒ మట్లి గ్రామపంచాయతీ కార్యదర్శి పిలిచి పరిష్కార మార్గం చూపించా లన్నారు. డి. రాచపల్లి సర్పంచ్ నాగులమ్మ తనయుడు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజల అందరికీ ఉపాధి పనులు కల్పించాలని కోరారు. ఎపిఒ చంద్రకళ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రభుత్వం 150 రోజులు పని దినాలు కల్పించిందన్నారు. పనులు కావాల్సినవారు డిమాండ్ నోటీస్ ఇస్తే వెంటనే వారికి పని కల్పిస్తామన్నారు. ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు అవృవద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి పట్ల తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కాకపోవడాన్ని వారు తప్పు బట్టారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఖాజాబీ, ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖ అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి రాజేంద్రనాథ్

రైతు సంక్షేమమే లక్ష్యంగా మార్కెట్ సంస్కరణలు



మాట్లాడుతున్న ఎఎంసి చైర్మన్ శివరామ్

ప్రజాశక్తి - మదనపల్లె టౌన్

రైతు మేలే లక్ష్యంగా, మార్కెట్ వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలనే సంకల్పంతో మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ కీలక నిర్ణయాలకు శ్రీకారం చుట్టిందని మార్కెట్ యార్డు చైర్మన్ జంగాల శివరామ్‌రాయల్ పేర్కొన్నారు. స్థానిక టమోటా మార్కెట్ సమావేశపు హాలులో డైరెక్టర్లు, మార్కెట్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ టమోటా రైతాంగానికి నష్టం లేకుండా న్యాయమైన ధరలు దక్కాలన్న ఉద్దేశంతో 2026 జనవరి 26 నుంచి టమోటా వేలం విధానంలో కీలక మార్పులు అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు ప్రత్యక్ష లాభం చేకూర్చే అంశాలపై దృష్టి సారించి నిర్ణయాలు తీసుకున్నారనీ తెలిపారు. 15 కిలోల క్రేట్ల విధానం, ఇప్పటివరకు వినియోగంలో ఉన్న 30 కిలోల క్రేట్ల వల్ల రైతులకు తూకం, ధరల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, ఇకపై పూర్తిగా 15 కిలోల క్రేట్లతోనే వేలం జరపాలని కమిటీ తేల్చిందిన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే అమలు దిశగా తీసుకెళ్లాలని మార్కెట్ సెక్రటరీ జగదీష్‌ను ఆదేశించారు. చిత్తూరు చీఫ్ కమర్షియల్ ఆఫీసర్‌తో చర్చలు జరిపిన మదనపల్లె సిటిఎం రైల్వే స్టేషన్ నుంచి గూడ్స్ రైళ్ల ద్వారా టమోటా రవాణా సాధ్యాసాధ్యాలను పరిశీలి స్తోందని, సిటిఎం, వాయల్పాడు, ములకలచెరువు, కురబలకోట ప్రాంతాల నుంచి కూడా గూడ్స్ రైళ్ల ద్వారా టమోటా తరలింపు జరగేలా చర్యలు తీసు కోవాలని రైల్వే అధికారులను కోరుతున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో మౌలిక వసతుల కల్పనకూ కమిటీ ప్రాధాన్యం ఇచ్చిందని, ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు, టమోటా మార్కెట్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి నిర్ణయం తీసుకునారని, వీటిని మార్కెట్ కమిటీ ద్వారానే నిర్మించి, నిర్వహణను ఔట్‌సోర్స్ చేయాలా లేదా పిపిపి విధానంలో అప్పగించాలా అనే అంశంపై చర్చ కొనసాగుతోందన్నారు. సమావేశంలో ఎ.ఎం.సి. డైరెక్టర్లు పాల్గొన్నారు.

సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికే వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించడానికి, వారిలోని సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని ఎంఇఒలు పద్మావతి, నారాయణ అన్నారు. గురువారం జడ్‌పి హైస్కూల్(తెలుగు) ఆవరణంలో మండల స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించామన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాల, కెజిబివి పాఠశాలలోని విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ అంశాలపై తయారుచేసిన ప్రాజెక్టులు, వాటికి సంబంధించిన నమూనాలను వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించారని తెలిపారు. వీటి ద్వారా విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించి, వైజ్ఞానిక ఆలోచనల పట్ల వారిలోని సృజనాత్మకతను, పరిశోధనా శక్తిని వెలికి తీసి భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా వారిని ప్రోత్సహించడానికి ఈ వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీంద్ర, ఉపాధ్యా యులు ఎస్.షబ్బీం బాష, బి.కమల, బి.కల్పన, కే.చంద్రకళ, ఎస్.జవిలి షమ, ఆర్.మల్లీశ్వరి, వెంకట గోపాల్, ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. **నందలూరు :** మండలస్థాయి వైజ్ఞానికప్రదర్శనను రాయచోటి డిప్యూటీ డిఇఒ నాగయ్య శుక్రవారం ప్రారంభించారు. నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలలో మండలంలోని అన్ని పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ తమ వైజ్ఞానికాంశాలను ప్రదర్శించారు. మొత్తంగా ఏడు విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను చాటుకున్నారు. విభాగానికి ఒకటి చొప్పున గెలుపొందిన వైజ్ఞానిక ప్రదర్శనలు శనివారం జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో ప్రదర్శింపబడతాయని డిప్యూటీ డిఇఒ నాగయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ అనంతకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, అన్ని పాఠశాలల సైన్సు, గణిత ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.నందలూరు జూనియర్ కళాశాల అధ్యాపకులు రామ్మోహన్ రెడ్డి, సురేష్, సమతలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



కలకడ : విద్యార్థుల తయారు చేసిన ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఇఒ

తంబళ్లపల్లి: తంబళ్లపల్లె ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు జరిగాయి. మండలంలోని 11 పాఠశాలల నుంచి 40మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని 30రకాల ప్రయోగాలు, వైజ్ఞానిక ప్రదర్శనల నమూనాలను ప్రదర్శించారు. జూనియర్ కళాశాల అధ్యాపకులు, ఎంఇఒ త్యాగరాజు, నాగ సుబ్బారాయుడు, ఎస్ఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఏడు ఉత్తమ నమూనాలను ఎంపిక చేశారు. వీరు 20న రాయచోటిలో జరిగే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

కలకడ: నేటి విద్యా ర్థులే భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని ఎంఇఒ మునీంద్ర నాయక్ పేర్కొన్నారు. మండలంలోని బాటవారిపల్లి జడ్‌పి హైస్కూల్ (తెలుగు)లో విజ్ఞాన శాస్త్ర ఎగ్జిబిషన్ నిర్వహించినట్లు తెలిపారు.ఈ ఎగ్జిబిషన్ లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్తగా ఎదగాలని సూచించినట్లు తెలిపారు. విద్యార్థులు తయారుచేసిన ప్రయో గాలను తిలకించారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం సాధించే వరకూ పోరాటం : జెఎసి

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట కేంద్రంగా అన్నమయ్య జిల్లా ప్రకటించే వరకు పోరాడుతామని ఎజెఎసి సభ్యులు పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం సాధన కోసం ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 13వ రోజుకు చేరుకున్నాయి. 13వ రోజు గురువారం సౌమిత్రి, కే.మణి, నాగేశ్వర్ రెడ్డి, నాయిని గోపి, పెను బాల శివయ్య, పాలగిరి ఇమ్రాన్, శంకర్, బాలసుబ్రమణ్యం, వెంకటేష్, హైదర్ సాహెబ్, ఎం.సుధాకర్, సత్యాలహరి పాల్గొని మాట్లాడుతూ జిల్లా స్థాయి కార్యాలయాలు నిర్మించుకోవడానికి కావలసినంత ప్రభుత్వ భూమి రాజంపేటలో ఉందని, ఇక్కడ నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. వివిధ రాష్ట్రాలకు రోడ్డు, రైల్వే కనెక్టివిటీతో పాటు అతి సమీపంలో కడప, రేణిగుంట విమానాశ్రయాలుఉన్నాయని తెలిపారు.

కళాకారుల దీక్షలకు 'యల్లటూరు' సంఘీభావం

పాత బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన జెఎసి రిలే నిరాహార దీక్షా శిబిరంలో రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాలకు చెందిన పలువురు కళాకారులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర ఆవశ్యకత, ఔన్నత్యాన్ని కొనియాడుతూ జిల్లాను రాజంపేట కేంద్రంగా చేయాలని కోరుతూ పలువురు కళాకారులు పాటలను గానం చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు కళాకారులను అభినందిస్తూ పూలమాలలతో సత్కరించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట పట్టణానికి చెందిన కళాంజలి సాంస్కృతిక సంస్థ, ఆలాపన ఆర్కెస్ట్రా, రిథం ఆర్కెస్ట్రా కళకారులు, గాయకులు ఎస్.కళాంజలి, కృష్ణారెడ్డి, పెంచలయ్య, శీను, శివ ప్రసాద్, ఆర్.వి సుబ్రహ్మణ్యం, పోస్ట్ మాస్టర్ లక్ష్మీనారాయణ, సీతారామయ్యపాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

నందలూరు: అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను రాష్ట్ర ప్రభుత్వం ప్రక టించాలని మండల కేంద్రంలోని జ్ఞాన దీప్తి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు ఆ పాఠశాల కరస్పాం డెంట్ అద్దంకి జానకినాథ్, ప్రధానోపాధ్యాయులు నిడిగింటి లక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాల నుంచి నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, స్థానిక బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అద్దంకి జానకినాథ్ మాట్లాడుతూ మూడు నియోజకవర్గాలతో ఉన్న అన్నమయ్య జిల్లాలో రాజంపేట మధ్యస్థంగా ఉంటుందని అన్నారు. రైలు మార్గం, ఎన్నో మౌలిక వసతుల తోపాటు రెండు విమానాశ్రయాలకు దగ్గరగా ఉంటుందని అన్నారు. ఎన్నో సదుపాయాలు ఉన్న రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో ఉపాధ్యాయులు, వెంకటరమణ, లక్ష్మి నరసమ్మ, దివ్య, మీనా, రాజమ్మ, సుహాసిని, తులసి, సురేష్, అరుణ్ పాల్గొన్నారు.

'సుగవాసి'ని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-చిన్నమండెం

రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడిగా ఎన్నికైన సుగవాసి ప్రసాద్ బాబుమండల టిడిపి నాయ కుడు ఏజాస్ ఖాన్ ప్రసాద్‌బాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సుగువాసి కుటుంబంతో గత కొద్ది సంవ త్సరాలుగా ఎంతో అవి నాభావ సంబంధం ఉందన్నారు. **కలకడ:** రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు ప్రసాద్‌బాబు, ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి నగిరిపల్లిలో ఎమ్మెల్యే గృహంలో మర్యా దపూర్వకంగా కలిసినట్టు మండల సింగిల్ విండో అధ్యక్షులు వెంకటరమ ణనాయుడు, మండల కో-ఆప్షన్ సభ్యులు టిఎస్ ఇనయ తుల్లా, ఎన్ఎండి టమోటా మండి యజమాని నిజాముద్దీన్ కలిసి ఇద్దరిని పూలమాలలు వేసి దుశ్శాలువాతో సత్కరించినట్లు తెలిపారు. **వీరబల్లి :** రాజంపేట జిల్లా టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబును మండల టిడిపి సీనియర్ నాయకుడు తాటికుంట్ల శ్రీధర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్క రించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట మధుసూదన్ రెడ్డి, పద్మనాభరెడ్డి, జైచంద్ర రెడ్డి, పవన్ రెడ్డి, చంద్ర, టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొని తమ మద్దతు తెలిపారు.



ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న టిడిపి నాయకులు



తల్లీబిడ్డను కాపాడిన డాక్టర్ దీప్తి

గర్భిణి ప్రాణాలను కాపాడిన డాక్టర్ దీప్తి

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని బురుజుపల్లి నుంచి కాన్పు వచ్చిన బండి తేజస్విని అనే గర్భిణిని కుటుంబ సభ్యులు స్థానిక పిహెచ్‌సిలో చేర్పించారు. కాన్పు కష్టతరం కావడంతో తిరుమల మెటర్నిటీ డాక్టర్ ఎం.ఎస్. దీప్తిని ఆహ్వానించగా ఆమె వచ్చి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సుఖ ప్రసవం చేశారు. కష్టతరమైన కాన్పును దీప్తిని స్థానిక వైద్య సిబ్బంది అభినందించారు. తేజస్వినికి మగ పిల్లవాడు 3.5కిలోల బరువు ఉండి తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్ ఆర్. మనోజ్‌కుమార్ డాక్టర్ ఎస్.రఫీ పేర్కొన్నారు. మదనపల్లి, రాయచోటి ప్రాంతాలకు వెళ్లే లోపే తల్లి బిడ్డ మృతి చెందే పరిస్థితులు ఉన్నాయని, అలా కాకుండా తల్లీబిడ్డ రక్షించుకోవడానికి మండల కేంద్రంలో తిరుమల మెటర్నిటీ హాస్పిటల్ ఉండడం సంతోషకరమన్నారు. డాక్టర్ ఎస్.దీప్తిని అభినందించి కొనియాడుతున్నారు. తేజస్విని భర్త రెడ్డప్ప తల్లి బిడ్డలతో క్షేమంగా ఇంటికి తీసుకెళ్లారు

పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

విద్యార్థుల సౌలభ్యం కోసం పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఫక్రుద్దీన్ సాహెబ్ అన్నారు. గురువారం నిమ్మనపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపును ఎఒ రమేష్ బాబు, గ్రామ వార్డు సచివాలయాల ఎంపిడిఒ లక్ష్మీపతితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఆధార్ కార్డు లోని సమాచారం మార్పు చేర్పులకు, ఇకెవైసి నవీకరణకు సచివాలయాల చుట్టూ, మీ సేవలో చుట్టూ విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలసి తిరుగుతూ వేయ ప్రయాసలతో ఇబ్బందులు పడుతుండేవారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి వారి సౌలభ్యం కోసం పాఠశాలల్లోనే గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది చేత ప్రత్యేకంగా ఆధార్ క్యాంపులను నిర్వహిస్తూ, విద్యార్థుల ఆధార్ కార్డులలో ఇకెవైసి, ఆధార్ కార్డులోని సమాచారాన్ని నవీకరిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు కూడా వారి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించి ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భాస్కరన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యుటిఎఫ్ కార్యవర్గ సమావేశం గురువారం బి.కొత్తకోట పట్టణంలో జరిగింది. మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా యు.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఎ.చలపతి, కోశాధికారిగా ఎస్.గిరీష్ ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఏర్పడిన కార్యవర్గానికి యూటీఎఫ్ కార్యకర్తలందరూ శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాల ద్వారా నేడు 2003 డిఎస్‌సి అభ్యర్థులకు పాత పెన్షన్ విధానాన్ని సాధించామన్నారు. ఉపాధ్యాయుల అభ్యున్నతి, వారి సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన రెడ్డిపవన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మాజీ సిఎం వై.ఎస్.జగన్‌ను మండలంలోని రామాచార్లపల్లెకి చెందిన వైసిపి యువ నాయకుడు రెడ్డిపవన్ రాయల్ గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్డిపవన్ మాట్లాడుతూ వర్ధమాన రాజకీయాల్లో జగన్మోహన్‌రెడ్డి సమర్థ వంతమైన, శక్తివంతమైన నాయకుడన్నారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ప్రజా రంజకమైన పాలన అందించారన్నారు. నవరత్నాలు, సంక్షేమ పథకాలతో పేదప్రజల జీవితాల్లో వెలుగులు నింపాన్నారు. పార్టీలో యువతకు పెద్దపీట వేస్తామని, వైసిపికి యువతే ప్రధానమని తెలిపారన్నారు. ఆయన సూచనలు, సలహాలతో, వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ నేతృత్వంలో నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని రెడ్డి పవన్ రాయల్ స్పష్టం చేశారు.

ఇంటి పన్ను వసూలు చేయండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

:గ్రామ సచివాలయ సిబ్బంది విధులలో అలసత్వం వహించవద్దని, అనుకున్న లక్ష్యానికి పంచాయతీకి రావలసిన ఇంటి పన్నులను వసూలు చేయాలని డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు అన్నారు. గురువారం సామకోటవారిపల్లె గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి వారి విధులపై తగు సూచనలు చేశారు. ఇంటి పన్నును అనుకున్న సమయానికి వసూలు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పంచాయతీకి పన్నులను చెల్లించేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో కొన్నిచోట్ల క్లస్టర్ మ్యాపింగ్ లో తప్పిదాలు జరిగాయని వాటిని వెంటనే సరి చేసుకోవాలని తెలిపారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ప్రతి నెల ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలను సేకరిస్తున్నాదని ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటూ తమ పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. ఐవిఆర్ఎస్ కాల్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించి వారి ద్వారా మంచి అభిప్రాయాన్ని ఉద్యోగులు పొందేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఉద్యోగుల పనితీరు పై అసంతృప్తి వస్తే తగిన వారు చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్య కొండపై జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మల్లయ్య కొండ మాజీ ఛైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి గురువారం పరిశీలించారు. స్థానిక నాయకులతో కలసి భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కొండ మధ్యలో ఏనుగు మల్లమ్మ ఆలయ నిర్మాణం, కొండపై వ్యూ పాయింట్ , పగోడాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఏనుగు మల్లమ్మ ఆలయ అభివృద్ధికి మద్దిరెడ్డి రూ.3 లక్షలు విరాళం ఇచ్చారు.

పోక్సో కేసులో పరారీలో ఉన్న నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-కలికిరి

పోక్సో కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి ఎం.ఆర్ కృష్ణమోహన్ తెలిపారు. మండలంలోని పల్లవోలు గ్రామం, గడికి చెందిన సయ్యద్ జునైద్ అహ్మద్ ఓ బాలికను ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడని కలికిరి అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో జనవరి 25న బాలిక తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు అయినప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా, బెంగుళూరు, గోవా, ముంబై, ధార్వాడ్, అజ్మీర్‌లో తప్పించుకొని తిరుగుతున్నాడని తెలిపారు. ఎస్‌పి ధీరజ్ కనుబిల్లి ఆదేశాల మేరకు కలికిరి అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్, సిఐ కె.రామచంద్రతో ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. నిందితుడు సయ్యద్ జునైద్ అహ్మద్ గురించి ఖచ్చితమైన సమాచారం మేరకు ఈనెల 17న కలికిరి - కలకడ రోడ్డులో ఉన్న అయోధ్య బస్సు స్టాప్ వద్ద నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం పీలేరు కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు.

దంపతులపై దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంటి వద్ద జరిగిన చిన్న ఘర్షణతో దంపతులపై దాడి చేసిన సంఘటన మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. కొండా మారిపల్లి పంచాయితీ బెస్తపల్లికి చెందిన పురుషోత్తం, అలివేలు దంపతుల ఇంటి ముందు అదే వీధిలో ఉండే మురళి భార్య లీలావతి చెత్త వేసింది. ఈ విషయంలో మాట మాట పెరగడంతో పురుషోత్తం, అలివేలు దంపతులపై మురళి, లీలావతి దంపతులతో పాటు వారి కుటుంబసభ్యులు, బంధువులు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితులను కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.